ప్రజాశక్తి
శుక్రవారం 05 సెప్టెంబర్ 2025
5
కర్నూలు

ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించాలి

డ్రోన్ కెమెరా ద్వారా ఆరోగ్య పర్యవేక్షణ పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ట్రిపుల్ ఐటి డిఎం ప్రొఫెసర్లు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ట్రిపుల్ ఐటిడిఎం విద్యా సంస్థ ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థను వినియోగదారునికి సౌకర్యంగా ఉండేలా రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రిపుల్ ఐటిడిఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటి డిఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రదర్శనను పరిశీలించి, త్వరలోనే పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థను రూపొందించాలని కలెక్టర్ ట్రిపుల్ ఐటి డిఎం అధికారులను ఆదేశించారు. ఇన్‌బిల్ట్ మైక్రోఫోన్, స్పీకర్ సౌకర్యం, తక్కువ శబ్దం కలిగిన ప్రొపెల్లర్లతో డ్రోన్‌ను రూపొందించేలా ప్రయత్నం చేయాలని కలెక్టర్ సూచించారు. సాధ్యమైతే డ్రోన్ పరిమాణాన్ని మరింత సన్నగా సమర్థవంతంగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈవ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోను రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షించే, వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈవ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో హెచ్చరికలు, గ్రీన్‌ఛానల్ సమయంలో అంబులెన్స్‌కు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థను రూపొందిస్తున్న ట్రిపుల్ఐటిడిఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసిఫా అంజుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు వీడ్కోలు

- ప్రశాంతంగా వినాయక నిమజ్జనం - జనాలతో కిక్కిరిసిన వినాయక ఘాట్ - పోలీసుల గట్టి బందోబస్తు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కర్నూలు క్రైమ్

కర్నూలులో గురువారం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. నగరంలో దాదాపు 1200 విగ్రహాలకు ప్రతిష్టించారని సమాచారం. మూడోరోజు నుంచే నిమజ్జనం ప్రారంభమైనప్పటికీ తొమ్మిదో రోజు అత్యధిక విగ్రహాలకు నిమజ్జనం చేశారు. గురువారం ఉదయం నుంచే పలువీధుల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా వినాయకఘాట్ వైపు తరలించారు. రాంబొట్ల దేవాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్, నగర మేయర్ బివై.రామయ్య, జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సాగనంపారు. రాంబొట్ల దేవాలయం వద్ద జరిగిన గణనాథుని లడ్డు వేలం పాటలో లడ్డును రూ.6 లక్షల 1 వేయికి వరుసగా ఐదవ సారి నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి దక్కించుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాలనా గణపతితో నిమజ్జనానికి శ్రీకారం చుట్టారు. వినాయక ఘాట్‌లో ముందుగా ధ్వజారోహణం ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం నిర్వహించారు. అనంతరం రాంబొట్ల దేవాలయం విగ్రహానికి నిమజ్జనం చేశారు. ఆ తరువాత అన్ని విగ్రహాలకు నిమజ్జనాన్ని చేశారు. దాదాపు రాత్రి 10 గంటల సమయానికి 500 విగ్రహాల దాకా 7 ఘాట్లలో నిమజ్జనం చేసినట్లు ఉత్సవ సమితి నాయకులు తెలిపారు. నగరంలో నిమజ్జనం అంగరంగవైభవంగా పండగ వాతావరణంలో పిల్లలు పెద్దలు మహిళలు కోలాహలంగా ఆడుతూ సంబరాలతో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాగునీటిని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నిమజ్జనం శుక్రవారం ఉదయం వరకు నిర్వహించే అవకాశం ఉంది. మత్స్యశాఖ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు విధుల్లో ఉండి ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్కడ ఎలాంటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ నిమజ్జన బందోబస్తును పర్యవేక్షించారు.

రాంబొట్ల వినాయక విగ్రహానికి పూజలు చేసి నిమజ్జనానికి తరలిస్తున్న కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే మేయర్, నాయకులు

డిజెలతో దద్దరిల్లిన నగరం

గణేష్ నిమజ్జనం సందర్భంగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు బేఖాతరయ్యాయి. ఈ నిబంధనలను అమలు చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు పలువురు నుంచి వినిపించాయి. శబ్దకాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా వినాయక నిమజ్జనోత్సవంలో డిజె సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని హైకోర్టు ఉత్తర్వులను ఇచ్చిన సంగతి తెలిసిందే. గురువారం నగరంలో నిర్వహించిన వినాయక విగ్రహ శోభాయాత్రలో డిజెలు సౌండ్లతో నగరం దద్దరిల్లింది.

ఏరులై పారిన మద్యం

వినాయక నిమజ్జనంలో కొంతమంది యువత డిజెల ముందు మద్యంతాగి మైమరచి చిందులేశారు. మరి కొంతమంది యువత ఫూటుగా తాగి రోడ్డుపైనే పడిపోయిన దృశ్యాలు కనిపించాయి. నిమజ్జనానికి రెండు రోజుల ముందుగానే మద్యం అమ్మకాలను నిలిపివేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో నగరంలో మద్యం షాపులు బంద్ చేసినా తెలంగాణ నుండి మద్యం తెప్పించుకున్నారు.

ట్రాఫిక్ మళ్లింపుతో ప్రయాణికులకు ఇబ్బందులు

వినాయక నిమజ్జనం సందర్భంగా ఆర్‌టిసి బస్సులను నగరంలోకి అనుమతించకుండా బస్టాండ్ నుండి హైవే మీదుగా రింగ్‌రోడ్డు నుండి నంద్యాల చెక్‌పోస్టు మళ్లించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. చాలామంది డ్రైవర్లు చుట్టూ తిరిగిపోక నంద్యాల చెక్‌పోస్టు నుండే ఆత్మకూరు, నందికొట్కూరు బస్సులను వెనక్కి తిప్పుకొని రావడంతో నగరంలోని ప్రజలంతా చెక్‌పోస్టు వరకు రావాల్సి వచ్చింది. నగరంలోని ప్రజలు కాలినడకన సిక్వాండ్ వచ్చి అక్కడి నుండి ఆటోలకు రూ.50 ఇచ్చి చెక్‌పోస్టుకు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలతో ప్రయాణం చేసే వారు వయోవృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

గుమ్మనూరు జయరామ్ ఖబర్దార్

- సిఐటియు నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేటర్

నగరంలోని కొత్త బస్టాండ్ సుందరయ్య సర్కిల్ వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఎపిరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుమ్మనూరు జయరాం ఖబర్దార్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. అంటూ సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. సిఐటియు న్యూ సిటీ కమిటీ నగర అధ్యక్షులు వై.నగేష్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఖబర్దార్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కె.ప్రభాకర్ రెడ్డి కి బహిరంగ క్షమాపణ చెప్పాలి. డౌన్ డౌన్ జయరాం అంటూ ప్లే కార్డ్స్ పట్టుకొని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు సిఐటియు నగర నాయకులు టి.రాముడు మాట్లాడారు. మ్మెల్యేగుమ్మనూరు జయరాం లిక్కర్ మాఫియా, రౌడీ షీటర్, ఇసుక మాఫియా తదితర సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రజలను డబ్బుతో ఓట్లు వేయించుకొని గెలిచి ప్రజలకు సేవ చేయాల్సింది పోయి బడా కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే ఉద్యోగాన్ని వెలగబడుతున్నారన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె .ప్రభాకర్‌రెడ్డి అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలోరైతులను కలడానికి వారి కష్టాలు తెలుసుకోవడానికి అక్కడ పర్యటనకు వెళితే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్ చేసి అనుచితవ్యాఖ్యలు మాట్లాడమంటే కార్పొరేట్ల లంచానికి రుచిమరిగిన గుమ్మనూరు జయరాం కార్పొరేట్ల గులాంగిరి చేస్తూ ఒక రౌడీవలె విజ్ఞత లేని సంస్కారం లేని మూర్ఖుడు లాగా మాట్లాడారన్నారు. కెవిపిఎస్ నగర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కర్ మాట్లాడారు. నగర ఆఫీస్ బేరర్స్ కె.సుధాకరప్ప బి.రాధాకృష్ణ, జి.ఏసు, ఎస్ఎండి మహమ్మద్ రఫీ, ఎం. వెంకటేశ్వర్లు, ఎస్. హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు. **గూడూరు:** గూడూరు మండల కేంద్రంలో సిపిఎం ప్రాంతాయ కార్యదర్శి జె.మోహన్ నాయకత్వంలో నిరసన తెలిపారు. గుమ్మనూరు జయరాంను ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

44 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

- 30 మంది ఉపాధ్యాయులకు - 14 మంది జూనియర్ లెక్చరర్లకు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 44 మందికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేసేందుకు జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. ఇందులో 30 మందికి ఉపాధ్యాయులకు 14 మందికి ఇంటర్మీడియట్ జూనియర్ లెక్చరర్లకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోనున్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శుక్రవారం జరిగే గురుపూజోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నారు. మంత్రి టిజి. భరత్ ఇతర ప్రజాప్రతినిధులు సమక్షంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేస్తారు.

6న చలో విజయవాడకు తరలిరండి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

పెండింగులో ఉన్న ఫీజులో రీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.6, 400 కోట్లు నిధులు వెంటనే విడుదల చేయాలని, విద్యారంగంలో నెలకొని సమస్యలు పరిష్కారానికి ఈ నెల 6న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప పేర్కొన్నారు. గురువారం కర్నూలు నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు ఆర్యన్, పద్మ జె, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ

8న కడపలో బహిరంగ సభ

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర ను తిప్పికొట్టండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-పత్తికొండ

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8,9,10 తేదీలలో కడప లో నిర్వహించే సమావేశాల సందర్భంగా 8న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.వీరశేఖర్, కెవి.నారాయణ కోరారు. గురువారం పత్తికొండ ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో బి.వీరశేఖర్, కెవి.నారాయణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ప్రేమ చూపి ఎన్నికల తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా మెజార్టీ పేద కుటుంబాలకు సరైన ఉపాధి, ఆవాసం, తిండి సమస్యగా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. దేశ ప్రజలకు తిండి పెట్టలేని ప్రభుత్వాలు పైకి మాత్రం ప్రగల్భాలు పలుకుతున్నాయని కార్పొరేట్ సేవలో తరిస్తున్న ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కూలీలు, పేదలు ఐక్యం కావాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు ఆత్మ గౌరవంగా ఉన్న భూ పంపిణీ రాష్ట్రంలో జరగాలని, భూ పంపిణీపట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఉపాధి వేతనాల పెండింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తుందని, నెలలు తరబడి ఉపాధి వేతనాలు పెండింగులో పెడుతూ ఉపాధి కూలీలను అర్ధాకాలితో ప్రభుత్వం వేదిస్తుందని పేర్కొన్నారు. వెంటనే ఉపాధి పెండింగ్‌వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో వ్యవసాయకులను ఐక్యం చేసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు, నరసన్న, మండల నాయకులు శికామణి రసీదు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆర్‌యు కన్వీనర్ డిమాండ్

ప్రజా శక్తి-కర్నూల్ కలెక్టరేట్: యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో ఛలో విజయవాడ గోడపత్రికలను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా యూనివర్సిటీలలో సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు.ఆర్‌యు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, సందీప్, అశోక్, గణేష్, పవన్,తిరుమల్,అనిల్,నవీన్, వినయ్, బాలాజీ, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ప్రజాశక్తితో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

' ఉపాధ్యాయులను గౌరవించడం అంటే కేవలం ఉపాధ్యాయ దినోత్సవం నాడు అన్ని స్థాయిల్లో శాలువాలతో, పూలదండలతో సత్కరించడం, పొగడ్తలతో ముంచెత్తడం కాదు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి. ఉపాధ్యాయులను పాఠాలు చెప్పనిచ్చి పాఠశాల విద్యా రంగంలో వారిని భాగస్వామ్యం చేయాలి. ప్రభుత్వం వారితో చర్చించాలి. ప్రజాస్వామిక దృక్పథంతో వారి సమస్యల పట్ల స్పందించాలి. సమాజంలో ఉపాధ్యాయులు కూడా భాగమని గుర్తించాలి. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు ఉపాధ్యాయ సంక్షేమం కూడా తమ బాధ్యత అని ప్రభుత్వం గుర్తించాలి. అప్పడే ఉపాధ్యాయ దినోత్సవం అర్థవంతం అవుతుంది.' అని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో.....

ప్రతి ఏడాది సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాం. ఆరోజు ఉపాధ్యాయుడుగా , ఆచార్యునిగా, తత్వవేత్తగా, రాజనీతిజ్ఞునిగా, పరిపాలనాదక్షునిగా ఒకనాటి మన భారత రాష్ట్రపతి రాధాకృష్ణన్ జయంతి. ఆయన 1888లో తిరుత్తణిలో జన్మించారు. 1896 నుండి 1900 వరకు తిరుపతిలోని మిషన్ ఉన్నత పాఠశాలలో తదుపరి నాలుగు సంవత్సరాలు నెల్లూరులో ప్రీ డిగ్రీ చదివారు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో బిఎ, ఎంఎ పూర్తి చేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో, రాజమండ్రి గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేశారు. విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్ గా ఉన్నారు. భారతదేశపు తొలి ఉపరాష్ట్రపతి గాను తదుపరి అత్యున్నతమైన రాష్ట్ర పీఠాన్ని అధిరోహించారు. దేశానికి రాష్ట్రపతి అయినా ఆయన ప్రేమించింది మాత్రం పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తినే. అందుకేనేమో ఆయన శిష్యులు అక్షరాలా ఆయన్ని గుండెల్లో కూర్చోబెట్టుకుని పల్లకి మోశారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిని స్మరించుకోవడానికి వీలుగా ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా "ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు భావితరం నిర్దేశకులు ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది" వంటి మాటలే ఉపాధ్యాయ దినోత్సవం నాడు పాలకుల నుండి వినిపిస్తూ ఉంటాయి. ఉపాధ్యాయులను దండలతో సత్కరించడం, పొగడ్తలతో ముంచెత్తడం షరా మామూలే.

బతకలేక బడిపంతులు స్థితి నుండి ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగా ఉపాధ్యాయుడు సామాజికంగా, ఆర్థికంగా మంచి హోదాతో పాటు సమాజ గౌరవాన్ని కూడా పొందిన మాట వాస్తవం. 1990 దశకంలో భారతదేశంలోకి ఆర్థిక సంస్కరణల పేరుతో నూతన ఆర్థిక విధానాలు ప్రవేశించక ముందు ప్రభుత్వ పాఠశాలలు, అందులోని ఉపాధ్యాయుల పరిస్థితి ఇలా ఉంటే, అనంతర కాలంలో ప్రపంచీకరణ నేపథ్యంలో గురువు తన గౌరవ స్థానం కోల్పోయేలా ప్రభుత్వ విధానాలు ,ఉపాధ్యాయుల పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు నయా ఉదారవాద విధానాల కారణంగా విద్యారంగం లాభసాటి వ్యాపారంగా మారటం వల్ల గురువు స్థానం మరింత దిగజారింది. ప్రభుత్వం విద్యారంగ బాధ్యత నుండి తప్పుకోజూస్తుంది. అందులో భాగంగానే పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయ పోస్టుల తగ్గింపు, సంవత్సరాల తరబడి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టక పోవడం, ఉన్న ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ముమ్మరం చేసి పాఠాలు బోధించనివ్వకుండా చేయడం, ప్రత్యామ్నాయంగా ప్రయివేటు బడులను ప్రోత్సహించడం, తల్లికి వందనం పేరుతో చదువు 'కొనే' పిల్లలందరికీ వేలకు వేలు నగదు పంపిణీ చేయడం చూస్తున్నాం.

పరీక్షల విధానం కూడా లోపభూయిష్టంగా ఉంది. ఈ సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మాతృ భాషా మాధ్యమం ఉంటుందో లేదో అర్థం కాని పరిస్థితి. విద్యార్థులలో, ఉపాధ్యాయులలో ఈ విషయంలో ఆందోళన పెరిగిపోతుంది. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పర్యవేక్షణ మీద దృష్టి కాకుండా వివిధ వివరాలు సేకరించడం, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను బోధనేతరపనులతో ఎలా ఆటంకపరచడం అనే అంశం పైనే దృష్టి సారిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ఎన్నికల విధులకు, జనాభా లెక్కల సేకరణకు మాత్రమే వినియోగించాల్సిన ఉపాధ్యాయులు రకరకాల శిక్షణ తరగతులు, అనేక రకాల బోధనేతర పనులతో సతమతమవుతూ బోధనకు దూరంగా ఉంటున్నారు. దీని వలన సమాజంలో కూడా ఉపాధ్యాయులు పలుచన అవుతున్నారు. దివాళాకోరు ప్రభుత్వాల నిర్వాకం వల్ల ఉపాధ్యాయుల ఔన్నత్యము మరుగుదొడ్ల ఫోటోలు తీసేస్థాయికి దిగజారిపోయింది. పుస్తకాలతో, నల్లబల్లలతో కాకుండా యాప్‌లతో కుస్తీ పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రధానోపాధ్యాయుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయింది. పాఠశాల పర్యవేక్షణ పై దృష్టి పెట్టలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారు. పాఠశాలలో అడుగుపెట్టిన దగ్గర నుండి పిల్లలతో కలిసిపోయి విద్యా వ్యాసంగం వైపు మళ్లించే కృషి చేసే అవకాశం లేకుండా ఏదో ఒక బోధనేతర కార్యక్రమంలో నిమగ్నం కావలసిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల దృష్టిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు చిక్కీలు, గుడ్లు, కిట్లు పంచేవారిగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది.

బతకలేక బడిపంతులుగా ఉన్న సమయంలో సమాజం నుండి వచ్చిన ఆదరణ ఈనాడు లేకపోవడానికి కారణం ఉపాధ్యాయులు కూడా విశ్లేషించుకోవాలి. సమాజానికి, ఉపాధ్యాయుడికి మధ్య ఏర్పడిన అంతరాలు తగ్గించుకునే ప్రయత్నం ఈ మధ్యకాలంలో జరగడం ఆహ్వానించదగిన పరిణామం. ఆ ప్రయత్నం మరింతగా పెంచుకోవాలి. పేద, బడుగు, బలహీన వర్గాల బిడ్డలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వారికి ప్రేమతో బోధించాలి. వారిలో శాస్త్రీయ దక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, తద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునే మన బోధన నుండి మనల్ని దూరం చేస్తున్న పాలకుల వైఖరిని ఎండగట్టాలి. అవసరమైతే తెగించి పోరాడాలి. ఉపాధ్యాయుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల పెంపుదలకు ఈ రాష్ట్రంలో బాధ్యత గల ఉపాధ్యాయులుగా సమాజంలో భాగంగా మారాలి. చుట్టూ ఉన్న సమాజం మద్దతు కూడగట్టాలి. వారిని పాఠశాల వైపు ఆకర్షించాలి. అప్పుడు ఆ సమాజమే పాలకుల మీద ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయులకు రక్షణ కవచంలా నిలబడుతుంది. సమాజం నుండి దూరమైపోయిన తర్వాత రక్షించుకోవడం కూడా సాధ్యం కాదు. **– ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

మతసామరస్యాన్ని చాటిన ఆవాస్ కమిటీ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కమిటీ గడియారం ఆసుపత్రి వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి ఆవాజ్ నగర కమిటీ సభ్యులు మతసామరస్యాన్ని చాటారని కార్యదర్శి షేక్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. దారి వెంట స్వచ్ఛంద సంస్థలు అల్పాహారాలు, తాగునీరు ఏర్పాట్లను చేశారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

గణేష్ నిమజ్జన కార్యక్రమం కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఆయన కెసికెనాల్, స్టాంటన్‌పురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు.

నోరు పారేసుకుంటే మూల్యం తప్పదు

గుమ్మనూరు జయరాంకు సిపిఎం, వైసిపి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి-పత్తికొండ

గుంతకల్ ఎమ్మెల్యేగుమ్మనూరు జయరాం నోరు అదుపులో పెట్టుకోకపోతే మూల్యం తప్పదని సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. గురువారం తుగ్గలి మండలంలో మాజీ ఎమ్మెల్యే తమ్మిరెడ్డి స్వగహంలో పత్రికా విలేకరుల సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి జడ్పిటిసి పులికొండ నాయక్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, సర్పంచి ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ సర్పంచి రామచంద్రారెడ్డి, సీనియర్ వైసిపి నాయకులు పెండేకల్ భాస్కర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అట్లా గోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు రాంపల్లి కొట్టాల వెంకటరాముడులు మాట్లాడారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడంలో ఆ ప్రాంతంలోనే రైతులు ఆహ్వానం మేరకు ప్రభాకర్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లారన్నారు. సోలార్ ప్రాజెక్టు వల్ల నష్టపోయిన రైతులు వివరాలు తెలుసుకొని ఆ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు వెళ్లిన సిపిఎం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్‌లో బెదిరించడం సరికాదన్నారు. తక్షణమే ప్రభాకర్‌రెడ్డికి గుమ్మనూరు జయరాం క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని వామపక్షాలు ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వైఎస్ఆర్సిపి నాయకులు తుగ్గలి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకొండ సుధాకర్ రెడ్డి ,మారెళ్ళ సుధాకర్ రెడ్డి ,మారెళ్ళ లింగన్న, రామలింగయ్య పల్లె వడ్డే వెంకటరాముడు, రాంపురం గంగాధర్ గోవిందరాజులు చెన్నంపల్లి రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం , వైసిపి నాయకులు



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

గుమ్మనూరు.. నోరు భద్రం..!

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

రైతు సమస్యలపై పోరాడే రైతుసంఘం నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం, బూతులు తిట్టడం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు తగదని, నోరు భద్రంగా పెట్టుకోవాలని, లేకపోతే రైతులే తగిన బుద్ధి చెబుతారని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు హెచ్చరించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులను దుర్భాషలాడడం సరైనది కాదన్నారు. సోలార్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరుకు రైతులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గతంలో ఆలూరు నియోజకవర్గం నుంచి గుమ్మనూరు జయరామ్‌ను రైతులు గుంతకల్లుకు తరిమికొట్టారని, భవిష్యత్తులో ఆ నియోజకవర్గం నుంచి కూడా బయటకు పంపిస్తారని తెలిపారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో 12 రోజుల నుంచి వేరుశనగ పంటను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ... కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి రుణం మంజూరు చేయాలని, ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు, కె.మల్లయ్య, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, తిక్కన్న, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆయప్ప, ఈరన్న, రంగస్వామి, ఈరన్న, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరి బాషా పాల్గొన్నారు.

సొసైటీ సిఇఒ బాధ్యతల స్వీకరణ

నరసింహుడును సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సొసైటీ సిఇఒగా బొజ్జి నరసింహుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. సిఇఒగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ ప్రమోషన్ పొంది ఎమ్మిగనూరు సొసైటీ బ్యాంక్ స్టాఫ్ అసిస్టెంట్‌గా వెళ్లారు. ఆయన వెళ్లి పోవడంతో ఖాళీగా ఉన్న సిఇఒ పోస్ట్‌లో సీనియర్ క్లర్క్ నరసింహుడును నియమించారు. బ్యాంకులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో రుణాలందించి, ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తానని పేర్కొన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ముందుగా బాధ్యతలు చేపట్టిన బొజ్జి నరసింహుడును అకౌంటెంట్ ఉషారాణి, క్లర్క్ లక్ష్మీనారాయణ, హనుమంతు రెడ్డి, అటెండర్లు లక్ష్మన్న, సుధాకర్, రైతు వరదరాజులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

పనికి తగ్గ వేతనమివ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఆస్పరి

అంగన్వాడీ కార్యకర్తలకు పనికి తగ్గ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రిటర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ఆశా, అంగన్వాడీ వర్కర్లకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 10న సిఐటియు మండల మహాసభలో అంగన్వాడీ, ఆశా, ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు బాలకృష్ణ, మధ్యాహ్న భోజనం కార్మికులు నాగరాజు, ఆంజనేయ, జయమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

మౌలిక వసతులకు పెద్దపీట

- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు పెద్ద పీట వేసి పరిష్కరించాలని మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ అధికారులకు ఎంపిపి జూటూరు హేమలత సూచించారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపిపి హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ అల్లాబకాష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎఒ శ్రీరామ్ ప్రవీణ్, ఎంఇఒ సావిత్రమ్మ, ఫరూక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున్‌రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్, ఎపిఎం శివయ్య, ఏపీవో జుబేర్ అహ్మద్, పిఆర్ ఎఇ సోమప్పలు వారి శాఖల్లో అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం దేగులపాడు సర్పంచి నీలకంఠ, బిల్లేకల్లు సర్పంచి కరివేముల సావిత్రి, కుందనగుర్తి సర్పంచి పురుషోత్తం మాట్లాడుతూ... తాగునీరు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని, ఫిల్టర్ చేసేలా చూడాలని సమావేశ దృష్టికి తెచ్చారు. సకాలంలో విద్యుత్ స్తంభాలు ఇవ్వడం లేదని నగరడోన సర్పంచి ట్రాన్స్‌కో ఎఇపై మండిపడ్డారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఈ మూడు నెలల్లో పారిశుధ్య పనులకు, స్వచ్ఛమైన నీరు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయాలని తెలిపారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి నగరడోన గ్రామంలో పాఠశాల అదనపు గదులు నిర్మించేలా కృషి చేస్తామన్నారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. సర్పంచి సుశీలమ్మ, సురేష్, ఎంపిటిసిలు సుంకన్న, భీమ లింగ, సరోజమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, సొసైటీ సిఇఒ హరికృష్ణ, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, సూపర్‌వైజర్ ఈరమ్మ, హౌసింగ్ అధికారి కృష్ణకుమార్, వెటర్నరీ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఐటిఐ కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ఐటిఐ ప్రభుత్వ కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టి, సొంత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ ఐటిఐ కళాశాల నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బసవరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2008లో ఆలూరులో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకు సొంత భవనం లేక, నెంబర్ వన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో పాతబడిన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. భవనం పురాతనం కావడంతో పైకప్పు పెచ్చులూడి, వర్షపు నీరు తరగతి గదుల్లోకి రావడం వల్ల విద్యార్థులు ప్రమాదాల బారిన పడటం, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని, సొంత భవనం ఏర్పాటుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు మణి, శివ, సుధాకర్, దాక్ నాయక్, ఉపేంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామి ఎల్ఐసి

- ఘనంగా ముగిసిన ఎల్ఐసి వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రపంచ ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసి మూడో స్థానంలో ఉందని వక్తలు తెలిపారు. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్ఐసి వారోత్సవాలు బ్రాంచి కార్యాలయంలో గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ రంగస్వామి, ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పులి నాయక్, కడప డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు పాటిల్ తిమ్మారెడ్డి, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు విజయ్ కుమార్, ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సుధాకర్ రావు, లియాఫీ బ్రాంచి కార్యదర్శి జయన్న మాట్లాడారు. ఎల్ఐసిలో ఉద్యోగ సంఘాలు, ఏజెంట్ల సంఘాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టి ఎత్తివేసిందని తెలిపారు. ఈనెల 22 నుంచి అమలవుతున్నట్లు చెప్పారు. దేశంలో అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల్లోనూ క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎల్ఐసి అగ్రగామిగా ఉందని అన్నారు. ఎల్ఐసి ఏజెంట్ సంస్థకు మూల స్తంభాలని, సంస్థ బాగుంటే అందరూ బాగుంటారని తెలిపారు. అందుకోసం మంచి వ్యాపారం చేయాలని చెప్పారు. అలాగే దేశంలో ఎల్ఐసిలో పెట్టే ప్రతి పైసా ప్రజల సొమ్మని, ప్రజల కోసమనే నినాదంతో పని చేస్తోందని పేర్కొన్నారు. ఎల్ఐసిలో వచ్చే ప్రతి లాభాన్నీ పాలసీదారునికి పంచుతుందన్నారు. ఎల్ఐసిలో పెట్టే ప్రతి పైసాకు ప్రభుత్వ గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. గురువులైన ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్లను ఏజెంట్లు ఘనంగా సన్మానించారు. ఉద్యోగులకు, ఏజెంట్లకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎల్ఐసి ఉద్యోగులు గోవర్ధన్, వెంకటేశ్వర్లు, హంపయ్య, పరమేశ్వర్ రెడ్డి, సురేష్, వీరారెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు మధుసూదన్, మొయినుద్దీన్, వీరాంజనేయులు, నాగ లింగయ్య, రామకృష్ణ, ఏజెంట్లు రమేష్, రంగస్వామి, హరినాథ్, వీరేష్, గఫూర్, దేవేంద్రమూర్తి, హరి, మోహన్, సుభాన్, నరసింహులు, ఈరన్న, జెకె.శివరాముడు, రత్నయ్య శెట్టి, శివారెడ్డి, అనంత బురళి, వేణుగోపాల్, నాగన్న, గురు రాజ్, ఎర్రినాథ్, పక్కీరప్ప పాల్గొన్నారు.

గురువును సన్మానం చేస్తున్న ఏజెంట్లు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

టిడిపి శ్రేణుల ఎరువుల దందా

- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎరువులను బ్లాక్‌లో అమ్ముకుంటూ టిడిపి నాయకులు రైతుల కడుపు కొడుతున్నారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి విమర్శించారు. గురువారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువుల కోసం వరుసగా నిలబడాలని కించ పరిచే విధంగా మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఎరువులను రైతుల సేవా కేంద్రాల్లో కాకుండా తెలుగు తమ్ముళ్ల కాంపౌండ్‌లో దించుతున్నారని విమర్శించారు. ఎవరైనా రైతులు మండల వ్యవసాయ అధికారికి ఫోన్ చేస్తే తూతూమంత్రంగా రెండు బస్తాల చొప్పున రైతులకు అందజేస్తున్నారని తెలిపారు. సరైన సమయంలో ఎరువులందక, ఇన్సూరెన్స్ సదుపాయం లేక, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ప్రతి ఒక్కరికీ లభించేవని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచి, పంటల గిట్టుబాటు ధరపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న సబ్ డివిజన్ కార్యాలయం వద్ద రైతులతో నిరసన చేపడుతున్నట్లు, రైతులు జయప్రదం చేయాలని కోరారు. వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రవి చంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, ఎమ్మెల్యే పిఎ వెంకట్రామిరెడ్డి, మండలాల అధ్యక్షులు జి.భీమారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రహ్లాద జోషి, బెట్టన గౌడ్, వైసిపి నాయకులు మహేంద్రా రెడ్డి, లీగల్ సెల్ అడ్వయిజర్ గురురాజ్ రావు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా : ఎఒ

ప్రజాశక్తి - కోసిగి

రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని ఎఒ ఎం.వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... 37 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందని, 12.6 మెట్రిక్ టన్నుల యూరియాను వందగల్లు ఆర్ఎస్‌కె ద్వారా పంపిణీ చేశామని తెలిపారు. 25 మెట్రిక్ టన్నుల యూరియాను దుద్ది, కోసిగి, సజ్జల గూడెం, పల్లెపాడు గ్రామ రైతులకు కోసిగి ఆర్ఎస్‌కె ద్వారా పంపిణీ చేశామన్నారు.

రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఎఒ

ఉరుకుందలో దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం ధర్మకర్త పాలక మండలి నియామకానికి దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను డిప్యూటీ కమిషనర్ వాణి పరిశీలించారు. గురువారం ఉరుకుందలోని దేవాలయ కార్యాలయంలో దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్, వ్యక్తిగత నోటరీలను పరిశీలించారు. దరఖాస్తుదారులైన ఛైర్మన్, మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ చెన్న బసప్ప, మాజీ సభ్యులు కొట్రేష్ గౌడ్, నూతనంగా దరఖాస్తు చేసుకున్న వల్లూరు నాగేశ్వరరావు, టిజి.పాండురంగ శెట్టి, రమాకాంత్ రెడ్డితో పాటు మరి కొంతమంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడారు. ధర్మకర్త మండలి కోసం మొత్తం 62 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో 58 మంది పరిశీలనకు హాజరు కాగా, నలుగురు దరఖాస్తుదారులు గైర్హాజరయ్యారని చెప్పారు. ఇందులో రెండు దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు అందజేస్తున్న సభ్యులు

దరఖాస్తులు అందజేస్తున్న సభ్యులు

పశువైద్యాధికారుల నిర్లక్ష్యం..!

- చర్మవ్యాధులతో మూగజీవాలు విలవిల...

ప్రజాశక్తి - కౌతాళం

వర్షాకాలం వచ్చిందంటే మూగ జీవాలను వ్యాధులు వెంటాడుతాయి. పాడి రైతులకు కష్టాలు మొదలవుతాయి. ఇలాంటి సమయంలో పశువైద్యాధికారులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కౌతాళం మండలం బాపురం గ్రామంలో ఉన్న పశువైద్యాలయంలో ఎవరూ లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన ఎల్ఎస్ఎ, అటెండర్ అధికారులు డుమ్మా కొట్టి రైతులకు అందుబాటులో ఉండడం లేదని గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాపురం, ఈర్లదిన్నె, దమ్ములదిన్నె గ్రామ పాడి రైతులు పశువులను చికిత్స నిమిత్తం పశు వైద్య కేంద్రానికి వచ్చి నిరాశతో తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఉందని పాడి రైతులు పేర్కొంటున్నారు. పశువులకు లంపీ స్కిన్ లాంటి చర్మవ్యాధులు వ్యాపించాయని, చికిత్స అందకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని రైతులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్య కేంద్రంలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని, పశువులకు వైద్యం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



వ్యాధి బారిన పడిన పశువు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - గోనెగండ్ల

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ గురువారం తెలిపారు. గోనెగండ్లలోని ఎంపిపి బస్టాండ్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దుర్గాన ఫర్వీన్, ఎర్రబాడు మెయిన్ పాఠశాలలో పనిచేస్తున్న శోభా దేవి, గాజులదిన్నె ఎంపిపి ఎస్సీ పాఠశాలలో పనిచేస్తున్న చిన్న బసవరాజును జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన ఉపాధ్యాయులు శుక్రవారం కర్నూలులో నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకోనున్నట్లు తెలిపారు. మండలం నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, జిల్లా కౌన్సిలర్ అబ్దుల్ సలీం, మండల నాయకులు అక్బర్, కెసి.నాగరాజు, లింగన్న, నాగలక్ష్మి, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి కెవి.గంగాధర్ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా రామ్మోహన్

మంత్రాలయం :

మండలంలోని మాధవరం గ్రామంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకోనున్నారని ఎంఇఒలు మొయినుద్దీన్, రాఘన్న తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా, డిఇఒ శ్యాముల్ పాల్ నేతృత్వంలో జిల్లాలో విధినిర్వహణలో బాధ్యతగా సేవలందించిన ఉపాధ్యాయులను సన్మానించేందుకు ఎంపిక చేశారని తెలిపారు. మండలంలోని మాధవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విరియాల రామమోహన్‌ను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఎంఇఒలు, మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పూలచింత పీఠాధిపతి మృతి

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం పూలచింత గ్రామం బండేగురు పీఠం పీఠాధిపతి జయశంకర స్వామి మృతి చెందారు. ఆయన పీఠానికి 5వ పీఠాధిపతిగా ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. జయశంకర స్వామి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాయచూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. మండల ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో గ్రామానికి చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ఆయన భక్తులు తరలివచ్చారు.

పీఠాధిపతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

జయశంకర స్వామి (ఫైల్)

టిడిపి నాయకుల నివాళి

టిడిపి పూలచింత గ్రామ సీనియర్ నాయకులు బండే గురుస్వామికి పితృవియోగం సంభవించింది. తండ్రి మరణంతో ఆయన దుఃఖ సంద్రంలో మునిగారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పూలచింత గ్రామానికి చేరుకుని జయశంకర స్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బండేగురుస్వామిని, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగితి ఈరన్న గౌడ్, మిల్లు నారాయణరెడ్డి, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్, చిన్న రాముడు, భార్గవ్ యాదవ్, సత్యారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయులను గౌరవించాలి

- ఎస్‌బిఐ మేనేజర్లు చంద్రశేఖర్, మధు

ప్రజాశక్తి - ఆదోని

విద్యాబుద్ధులు నేర్పి దశ, దిశా నిర్దేశం చేసే ఉపాధ్యాయుని గౌరవించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు చంద్రశేఖర్, మధు తెలిపారు. గురువారం పురపాలక ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉపాధ్యాయులను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు కె.రవి అధ్యక్షత వహించారు. బ్యాంకు మేనేజర్లు మధు, చంద్ర శేఖర్, ముఖ్య అతిథి నాగరాజు స్వామి మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి గొప్పదని తెలిపారు. ఉపాధ్యాయులు జి.వీరచంద్ర యాదవ్, గిడ్డా రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వరి, శ్రీరాములు, చక్రపాణి, హనుమంతు, బ్రహ్మానంద రెడ్డి ఉన్నారు.

వెలిగించే కొవ్వొత్తుల వంటి వారన్నారు. పాఠాలను అర్థం చేసుకునేలా, లక్ష్యాన్ని చేరుకునేలా ప్రోత్సహించడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తారని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు శాలువా, పూలమాల వేసి సన్మానం చేశారు. ఉపాధ్యాయులు ఖలీల్, నీలకంఠ, ఈశ్వర్, సతీష్ కుమార్, దీప్తి, సిద్ధ రామప్ప, లావణ్య, నిజాం, అంజినమ్మ, పద్మావతి, అశ్విని, పవిత్ర, త్రివేణి, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి

స్థానిక నారాయణ ప్రైమ్ స్కూల్‌లో గురువారం ముందస్తు ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నరేష్ ఆచారి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు మనకు జ్ఞాన మార్గాన్ని



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ నరేష్ ఆచారి

ఉపాధ్యాయులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేవనకొండలోని విబిఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ సుభాన్ దంపతులు గురువారం ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... 2016లో విబిఆర్ స్కూల్ స్థాపించి ఉపాధ్యాయులుగా పని చేస్తూ సంతృప్తి పొందుతున్నామని తెలిపారు. ప్రస్తుతం 2025 మెగా డీఎస్సీలో స్కూల్ కరస్పాండెంట్ సుభాన్, భార్య షేక్ యాస్మిన్ స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉద్యోగాన్ని పొందారని చెప్పారు.

వస్త్రాలు పంపిణీ చేస్తున్న సుభాన్

క్విజ్ పోటీల్లో 'ఎఫ్ఆర్' ప్రతిభ

ప్రజాశక్తి- దేవనకొండ

ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థి ఆయేషా మొదటి బహుమతి సాధించినట్లు ఆత్మగౌరవ వేదిక ప్రెసిడెంట్ భీమా రెడ్డి, జనరల్ సెక్రటరీ

బహుమతులు ప్రదానం అందజేస్తున్న సభ్యులు

ఎం.కృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో ఆస్పరి, దేవనకొండ మండలాల నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎఫ్ఆర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప అధ్యక్షత వహించారు. వెలమకూరు సర్పంచి టి.భాస్కర్, ఎఫ్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ పి.రఘునాథ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎ.ఉచ్చీరప్ప విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్న రెయిన్‌బో స్కూల్ విద్యార్థి వై.ప్రసన్నకుమారి, మూడో బహుమతి ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిహెచ్.దివ్య, నాలుగో బహుమతి దేవనకొండ కెజిబివి విద్యార్థి జి.కావ్య, ఐదో బహుమతి కుంకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.రజిని, పుటకలమర్రి ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి ఎమ్‌డి దిల్షాద్ ఆరో బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ రవికుమార్, కెజిబివి ఉపాధ్యాయులు డి.మహేశ్వరి, ఆస్పరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నీలోఫర్, సుజాత, బాష, స్రవంతి, శ్రావణి, గోపాల్, రంగస్వామి, ఎస్ఎమ్‌డి.బాష, షబానా, లక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కుంకనూరు, పొట్లపాడు, దేవనకొండ గ్రామాల నుంచి మెగా డీఎస్సీ-2005లో ఎంపికైన ఉపాధ్యాయులను యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, యుటిఎఫ్ నాయకులు రాజశేఖర్, హుసేని, ఆనంద్ కుమార్ సన్మానించారు. గురువారం కుంకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సన్మానం చేశారు. ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా ఎంపికైన హనుమంతు, నవతమ్మ, సరిత, పోలీస్ మధు, కార్తీక్, భాస్కర్, స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన కిరణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, మునిస్వామిని శాలువా, పూలమాలలతో సన్మానించారు.

సన్మానం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆదోని

ఆర్థిక సాయం అందిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

సంపాదించే వ్యక్తి చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అభాగ్యురాలికి ఆర్థిక సహాయంతో అండగా నిలిచినట్లు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుని ఐదుగురు ఆడపిల్లలతో కుటుంబ పోషణ భారమై ఆర్థిక కష్టాలు పడుతున్న పింజరి షాహిన్ కుటుంబాన్ని చూసి చలించి ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. పట్టణంలోని విజయనగర్ కాలనీలో పింజరి మహ్మద్ అలీ 18 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. అలీకి ఐదుగురు చిన్న ఆడపిల్లలు ఉండడంతో వారి జీవనం ఇబ్బందిగా ఉందని, ఆదుకోవాలని గుడిసె కృష్ణమ్మను సంప్రదించారు. గురువారం వారి ఇంటికి వద్దకెళ్లి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. బైచిగేరి ఓంకార్, కపటి మహాదేవ్, మాంత్రికి మునిస్వామి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు సాధిక్ వలీ, రాజశేఖర్, నాగరాజ్, లక్ష్మీనారాయణ, అశోక్, శేఖర్, వీరేష్, భరత్, మహాదేవ్, ఆనంద్, ఈరన్న, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

'ఆర్‌టిఈ' సమస్యలు పరిష్కరించాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు



మాట్లాడుతున్న దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిఈ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. బుధవారం ఆదోనిలో బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం 2009 అమలుకు, ఆర్‌టిఈ విద్యార్థుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వర రావు, పట్టణ గౌరవ సలహాదారులు నల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీ బి.చిన్న ఈరప్ప, పగడాల కిరణ్ కుమార్, బెస్త కత్తి ప్రసాద్, పగడాల అజయ్ కుమార్ ఉన్నారు.

ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు : సిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని తొగలగల్లు గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం (31)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని తండ్రి గొల్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. రామకృష్ణా రెడ్డికి ముగ్గురు కుమారులని, రెండో కుమారుడు అహోబిలంకు కలపరి గ్రామానికి చెందిన గంగావతితో పెళ్లి చేసినట్లు తెలిపారు. మాల పున్నమి పండగకు అహోబిలం కుటుంబ సభ్యులతో వెళ్లారని, బుధవారం భార్యను, పిల్లలను అక్కడే వదిలి మోటార్ సైకిల్‌పై తిరిగి బయల్దేరారని చెప్పారు. దొడగొండ గ్రామ సమీపంలో వర్మీకంపోస్ట్ తయారీ కేంద్రం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్య చేశారని తెలిపారు. త్వరలో నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ టి.హర్షకిరణ్

ఎవరి జీవితాన్ని వారు చక్కదిద్దుకోవాలి

మోటివేషనల్ స్పీకర్ టి.హర్షకిరణ్

ప్రజాశక్తి-పత్తికొండ

విద్యార్థి దశ నుండే ఎలా ఉండాలని అంశంపై స్థానిక శాంతి టాలెంట్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన ప్రేరణాత్మక వక్త, మోటివేషనల్ స్పీకర్ టి.హర్షకిరణ్ విద్యార్థులకు జీవితంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జీవిత నైపుణ్యాలు, జీవన ప్రగతి , వృతి నైపుణ్యాలను గురించి సలహాలు, సూచనలు పిల్లలకు తెలియజేశారు. విద్యార్థులు మొదట ఉండే మానసిక ఆరోగ్యం పై అవగాహన ఎలా సృష్టించుకోవాలని, మానవుడు సంతోషంగా విజయవంతమైన, సమర్థవంతమైన జీవితాన్ని ఎలా గడపాలని, అనేక చిట్కాలను పిల్లలకు తెలియజేశారు.మంచి వ్యక్తిత్వాన్ని, లక్ష్యసాధనను ఎలా అలవర్చుకోవాలని, కఠిన శ్రమ అంటే ఏమిటి ఎటువంటి దురాలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల అలవాట్లు, అభిరుచులు, ఆశయాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎలా ఉండాలనే అంశాలపై చక్కగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి వీడ్కోలు

నిమజ్జనానికి భారీగా తరలిపోతున్న వినాయక విగ్రహాలు

నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుని వద్ద కర్నూలు కమీషనర్, మేయర్

నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుని విగ్రహాలముందు కర్నూలు ఎస్పి

ఘాట్ వద్ద కెసి కెనాల్‌లో నిమజ్జనానికి సిద్ధం చేసిన వినాయకుని విగ్రహం

వృత్తి గౌరవాన్ని పెంచిన ఉపాధ్యాయ శతకం

ప్రజాశక్తి-ఆదోని

ఉపాధ్యాయుడు ప్రతియుగంలోను పూజ్యనీయుడు. బోధన అనేది కళ. సృజనాత్మకత కలిగిన ఉపాధ్యాయుడు ఈ కళలో రాణించగలడు. విద్యార్థి మనసులో బలమైన ముద్రవేస్తాడు. ఉపాధ్యాయుడు భూత కాలాన్ని, వర్తమానంతో అన్వయించి, భవిష్యత్తుతో కలిపే వారధి. సమాజ నిర్మాతగా తద్వార దేశనిర్మాతగా అతనిది బాధ్యతాయుతమైన వృత్తి. పవిత్రమైన వత్తి. అందుకే గురువుని దేవుని తో పోల్చుతూ గురుబ్రహ్మ అంటారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కవి, రచయిత, ఉపాధ్యాయులు అవుల బసప్ప రచించిన ఉపాధ్యాయ శతకంలోని కొన్ని పద్యాలు....

సర్వసష్టికర్త - సర్వేశు స్తుతియింతు
పరమ గురువు మీరు - వరములిమ్ము
నాకు దీవెనిచ్చి - నడిపింపుమూ, నేను
భావి భారతీయ - భాగ్యశిల్పి

విశ్వనరుల మదిని - వికసింప దీక్షతో
మనకు బోధ చేసి మాన్యులైరి
స్ఫూర్తి నొందు వారి - సుగుణమనుసరించు
భావి భారతీయ - భాగ్యశిల్పి

దేశ ప్రగతి మార్చు - దేవాలయము బడి
జ్ఞానమార్పు జరుగు - ధ్యాన భూమి
సర్వ కళలు సజన - సల్పు రంగస్థలం
భావి భారతీయ - భాగ్యశిల్పి

మట్టి బొమ్మ లాంటి - మనుజుని విజ్ఞాన
ప్రాణనాడు లెన్నొ - రంగరించి
చేతనత్వములను - చేయువాడు గురువు
భావి భారతీయ - భాగ్యశిల్పి

దేవళముల నున్న దేవతామూర్తులన్
శిల్పి చెక్కు రీతి - శిష్య శిలను
చక్కనైన రీతి - చెక్కవలయు నీవు
భావి భారతీయ భాగ్యశిల్పి

నీతిదప్పి నీవు - నీతులు చెప్పంగ
నెవ్వరు వినబోరు నీదు మాట
మాటలకును క్రియల - మధ్య పొంతన గూర్చు
భావి భారతీయ - భాగ్యశిల్పి

ఆచరించు వాడె - యాచార్యుడనిరిల
విలువలు వెలుగొంద - మలచు కొనుము
సత్ప్రవర్తనమ్ము - సర్వదా గల్గియున్
భావి భారతీయ భాగ్యశిల్పి

నేటి గురువులందు- నిర్వేద మున్నదా?
వత్తి ధర్మ మందు - చిత్తమెంత ?
చెరపగొట్ట వద్దు - తరము నాశనమగు
భావి భారతీయ భాగ్యశిల్పి

రాణియైన, దేశ - రాజైన, పేదైన,
మందహాసమొందు - మంత్రియైన,
శిరము వంచి మొక్కు - గురువును చూడంగ
భావి భారతీయ భాగ్యశిల్పి

విద్యయధ్యసమున వివిధ గురువులున్న
గుండెలోన నిలుచు - గొప్ప గురువు
తారలెన్ని యున్న- తారాధిపుడొకడే
భావి భారతీయ భాగ్యశిల్పి...

నేత్రా దానం గొప్పది

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉల్లిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమన్ని గురువారం జిల్లా నోడల్ అధికారి డాక్టర్.రఘు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. పెద్దలు అందమైన ప్రపంచాన్ని చూడాలంటే కంటి చూపు అవసరమని, ఈ సృష్టిని చూసే అవకాశం ఉండాలంటే నేత్రా దానమే ఏకైక మార్గం , అన్నీ దానాల్లోకి నేత్రా దానం గొప్పదని నేత్రా దానం చేయడం ద్వారా మరణించాక కూడా మరో జీవితకాలం ప్రపంచాన్ని చూడవచ్చునని అన్నారు. ప్రతి మనిషి చనిపోయినప్పుడు వారి అవయవాలను కాల్చడం లేదా పాతి పెట్టడం ద్వారా మట్టిపాలు చేస్తున్నామని తెలిపారు. అలా కాకుండా చనిపోయిన వ్యక్తి 6 గంటల్లోపు నేత్రా దానం చేసినట్లయితే మరోజీవితకాలం పాటు వారి కండ్ల ద్వారా ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని తెలిపారు. వివిధ రోడ్డు ప్రమాదాల్లో, అనారోగ్యాలు, సహజ మరణంతో నిత్యం ఎంతో మంది మరణిస్తుంటారు. చనిపోయిన వ్యక్తి నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితల్లో వెలుగు నింపవచ్చును, నేత్రదానం ద్వారా వ్యక్తి మరణించినా అతని కళ్ళు జీవించే ఉంటాయన్నారు. చనిపోయిన వ్యక్తి వేరొకరి ద్వారా ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాడు, అంధులకు కార్నియా ఆపరేషన్ల ద్వారా కంటి చూపును ప్రసాదించ వచ్చును, ఇంతటి ప్రాముఖ్యమున్న నేత్రాలను సంరక్షించుకోవడం, అంధత్వాన్ని నియంత్రించడంలో జాగ్రత్తలను సూచిస్తూ అగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రా దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు, నేత్రా దానానికి ముందుకు వచ్చే వ్యక్తులు చనిపోయిన వెంటనే 6 గంటలలోపు 9849903116 గాని లేదా 9640692299 నెంబర్ లకు తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమములో డాక్టర్.నవీన్ కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి గంగావతి, ఆరోగ్యకార్యకర్త సుబ్బలక్ష్మమ్మ, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆయెషా ఆషా కార్యకర్తలు మధుకుమారి,సుజాత, , మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఉలిందకొంగ గ్రామంలో నిర్వహించిన సంచార చికిత్స ను పర్యవేక్షిస్తున్న డాక్టర్ రఘు

నిమజ్జనం సందర్భంగా జిజిహెచ్ లో వైద్యుల స్పెషల్ టీం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వినాయక నిమజ్జనోత్సవం దృష్ట్యా ఎమర్జెన్సీ డిపార్టుమెంటులో పని చేసే ఎమర్జెన్సీ మెడికల్ ఆఫీసర్లు , డిఎపి , డిఎమ్, డిఒఎస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 30 నర్సింగ్ స్టాఫ్, ఇతర సహాయక సిబ్బంది అందుబాటులో ఉండేలా అడిషనల్ డిఎంఇ, ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం వైద్యల స్పెషల్ టీం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం నిమజ్జనోత్సవ సమయంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనడం, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించడం, పలు ప్రాంతాల్లో జరిగే రద్దీ కారణంగా చిన్నపాటి ప్రమాదాలు, గాయాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆసుపత్రి తరపున ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. అత్యవసర ఔషధాలు, శస్త్రచికిత్స పరికరాలు, రక్తనిల్వలు, ప్రథమ చికిత్స సామాగ్రిని పూర్తి స్థాయిలో సిద్ధం చేసి ఉంచామని, ఏసమయంలోనైనా జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన వైద్య సేవలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కర్నూలు ప్రజలు నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని కోరుకుంటున్నాను. ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చినా 24 గంటలు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని స్పష్టం చేశారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జి సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రమణ్యం, ఎమర్జెన్సీ డిపార్టుమెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అడిషనల్ డిఎంఇ డాక్టర్ వెంకటేశ్వర్లు , డాక్టర్ వెంకటరమణ